

యోగాతో ఏకాగ్రత

ఎస్‌సి కార్పొరేషన్ ఇడి గడ్డెమ్మ


యోగాసనాలు వేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

యోగాతో ఏకాగ్రతను పెంచుకోవచ్చని ఎస్‌సి కార్పొరేషన్ ఇడి గడ్డెమ్మ తెలిపారు. 80 అడుగుల రహదారిలో ఎస్‌సి కార్పొరేషన్ ఆధ్వర్యాన గురువారం యోగాంధ్ర కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండొచ్చని చెప్పారు. ఈ సందర్భంగా యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు మురళీకృష్ణ, తంగి స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆహారం కల్తీ... తింటే సుస్తీ

- యథేచ్ఛగా రంగులు కలిపిన ఆహార పదార్థాల విక్రయం
- కాలం చెల్లిన తినుబండరాలను అంటగడుతున్న వ్యాపారులు
- ఫుడ్ లైసెన్స్ లేకుండానే అమ్మకాలు
- మొక్కుబడి తనిఖీలతో నెట్టుకొస్తున్న అధికారులు



రాగోలులోని ఓ ధాబాలో నిల్వ ఆహారపదార్థాలను పారబోస్తున్న అధికారులు (ఫైల్) (ఇన్‌సెట్‌లో శ్రీకాకుళం ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో కొనుగోలు చేసిన కాలం చెల్లిన లేస్ ప్యాకెట్)

శ్రీకాకుళం నగరం రైతు బజార్ ప్రాంతంలో ఉన్న ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో మార్చి నెలలో ఆహార భద్రతా అధికారులు ఆహార నమూనాలు సేకరించారు. వాటిని హైదరాబాద్ ల్యాబ్‌కు పంపారు. చికెన్‌లో ఉపయోగిస్తున రంగులతో కేన్సర్‌కు దారి తీస్తోందని రిపోర్టు వచ్చింది. దీనిపై అధికారులు కేసు నమోదు చేశారు. శ్రీకాకుళం నగరంలోని స్థానిక మండల కార్యాలయానికి సమీపంలోని ఒన్‌వే ట్రాఫిక్ రోడ్డులో ఉన్న పాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో తీసిన చికెన్ శాంపిల్స్‌లోనూ హానికర విష పదార్థాలు ఉన్నట్లు తేలింది. గతంలో రాగోలులోని ఓ దాబాలో నిల్వ ఉంచి మంసాహారాన్ని అధికారులు గుర్తించి వాటిని బయట పారబోయించారు. ఇటువంటి ఉదాహరణలు కోకల్లలు ప్రభుత్వ ఆదేశాలతో ఇటీవల సూర్యమహల్ సినిమా హాల్‌ను తనిఖీ చేసిన అధికారులు అక్కడ అనేక లోపాలను గుర్తించారు. థియేటర్‌లో నిర్వహిస్తున్న కేంటీన్‌కు ఏకంగా ఫుడ్ లైసెన్స్ లేకపోవడం గమనార్హం. దీంతో అధికారులు నోటీసులు జారీ చేశారు. ఆహార విక్రయాల అనుమతులు లేకపోవడం సూర్యమహల్‌కే పరిమితం కాలేదు. జిల్లాలో చాలాచోట్ల పాస్ట్‌ఫుడ్ సెంటర్లు లెసెన్స్ లేకుండానే యథేచ్ఛగా అమ్మకాలు సాగిస్తున్నాయి.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఫుడ్ లైసెన్స్ పొందిన హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, దాభాలు రెండు వేల వరకు ఉన్నాయి. ఇవి కాకుండా అనుమతి లేకుండానే నిర్వహిస్తున్న దుకాణాలు లెక్కకు మించి ఉన్నాయి. తోపుడు బండ్లకైతే లెక్కే లేదు. ఆహార పదార్థాలు ముఖ్యంగా మాంసార పదార్థాలు ఆకర్షణీయంగా కనిపించడానికి రకరకాల రంగులు వినియోగిస్తున్నారు. ఆహార భద్రతా అధికారులు నమూనాలు సేకరిస్తున్న ప్రతిచోటా ఇవి హానికరమే అంటూ ల్యాబ్ రిపోర్టులు చెప్తున్నా యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. హోటళ్లు, రెస్టారెంట్లలో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను సైతం మాంసార ప్రియులకు అంటగడుతున్నారు. ఇక నిషేధిత ప్లాస్టిక్ వినియోగమయితే వేరే చెప్పనక్కర్లేదు. వేడివేడి టీ, పాలు, సాంబారు వంటి వేడి పదార్థాలను సన్నటి మందం కవర్లలో పోసి ఇస్తున్నారు. ఉప్మా, దోశ ఇలా ప్రతిదీ కాగితంపైన ప్లాస్టిక్ కవరు పరిచి ప్యాక్ చేసి ఇస్తున్నారు. మధ్యాహ్నం భోజనం, బిర్యానీ వంటి ఏ ఆహారమైనా ఎంత వేడిగా ఉన్నా ఎవరూ ఆలోచించడం లేదు. పేపరు ప్లేట్ల పేరుతో ప్లాస్టిక్ పూత కలిగినవే ఎక్కువ వాడుతున్నారు. ఇది సులువుగా ఆహారంలో కలిసి అనారోగ్యం కలిగిస్తున్నాయి. ఆహారపదార్థాల తయారీలో ఉపయోగించే ముడి సురుకుల్లో కల్తీ యథేచ్ఛగా సాగుతోంది. వాడిన మరిగిన నూనె రోజుల తరబడి ఆహార పదార్థాల తయారీలో వాడుతుండడంతో వినియోగదారులకు పలు అనారోగ్యం బారిన పడుతున్నారు.

కల్తీ... కల్తీ

టీ నుంచి నిత్యవసర సరుకులు మిరప్పొడి, కందిపప్పుతో నగరంలో అన్నీ కల్తీ మయమే. హోటళ్లలో విక్రయించే ఆహార పదార్థాలు, బేకరీలో తయారయ్యే చిరుతిండ్లు, తినుబండారాలు వరకు వ్యాపార లాభాపేక్షతో కల్తీమయంగా మారిపోతున్నా యికారప్పొడి, కందిపప్పు, పెసరపప్పు, శనగపిండి, ఇడ్లీ రవ్వ, ఇలా కాదేది కల్తీకి అనర్హం అన్న రీతిలో ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. కల్తీ టీపొడి వినియోగించడం ద్వారా కిడ్నీ వ్యాధి సమస్యలతో పాటు ఉదర సంబంధ వ్యాధులు కేన్సర్, తదితర అనారోగ్య సమస్యలకు కారణమవుతోంది. అంతే కాకుండా రోడ్డు పక్కన విక్రయించే వివిధ చిరుతిండ్లు, డాబాలు, ఇతర హోటళ్లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

లెసెన్స్‌లు లేకుండానే విక్రయాలు

ఫుడ్ లైసెన్స్ అనుమతుల జారీ మూడు కేటగిరీలుగా జారీ చేస్తున్నారు. సంవత్సరానికి రూ.12 లక్షల లోపు టర్నోవర్ ఉన్న తోపుడు బండ్లు, చిరు వ్యాపారులు రూ.వంద, రూ.12 లక్షలు దాటి టర్నోవర్ కలిగిన ట్రేడర్స్, మార్కెటింగ్ వ్యాపారులు రూ.2 వేల నుంచి రూ.5 వేలు వరకు లైసెన్స్ చెల్లించాల్సి ఉంటుంది. రూ.20 కోట్లు టర్నోవర్ దాటితే రూ.7,500 అనుమతి రుసుము చెల్లించి సెంట్రల్ లైసెన్స్ తీసుకోవాలి. ఈ నిబంధనలు చాలా వరకు క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదు

కాలం చెల్లిన ఆహారపదార్థాల విక్రయం

మాంసారాల్లో రంగులు కలపడం, ఆహార పదార్థాలను కల్తీ చేస్తున్న ఘటనలు ఒక వైపు యథేచ్ఛగా సాగుతున్నాయి. మరోవైపు కాలం చెల్లిన తినుబండారాలను విక్రయిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధానంగా చిన్నపిల్లలు అమితంగా ఇష్టపడే కురుకురే, లేస్, బిస్కట్ ప్యాకెట్లు వినియోగ తేదీ దాటినా అమ్మకాలు సాగిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. కిల్లీ బడ్డి మొదలు డిపార్టుమెంట్ స్టోర్స్ వరకు ఈ తంతు సాగుతోంది. ముఖ్యంగా ఆర్‌టిసి కాంప్లెక్స్, బస్టాండ్లలో వీటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ప్రయాణాల హడావుడిలో వినియోగదారులు సరిగా తేదీ చూసే సమయం ఉండకపోవడంతో ఇదే అదనుగా వ్యాపారులు ప్రజలకు అంటగడుతున్నారు.

కేసులు నమోదు చేస్తున్నాం



జిల్లాలోని హోటళ్లు, దాభాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నాం. అనుమానం ఉన్న చోట్ల నమూనాలు సేకరిస్తున్నాం. ఆహార పదార్థాల నమూనాలను ల్యాబ్‌కు పంపుతున్నాం. వచ్చిన నివేదికలు ఆధారంగా కేసులు నమోదు చేస్తున్నాం.

- కె.వెంకటరత్నం, జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్

ఆహార కల్తీతో ఆరోగ్యానికి ముప్పు



రంగులు కలిపిన లేదా ఎక్కువ మోతాదులో మసాలు వినియోగించిన ఆహార పద్దారాలతో ఆరోగ్యానికి తీవ్ర ముప్పు ఉంటుంది. డయేరియా, జీర్ణ సమస్యలు వెంటనే తలెత్తుత్తాయి. మేతనిల్ యెల్లో వంటి రంగుల వల్ల కాలేయానికి నష్టం కలుగుతుంది. లీడ్ క్రోమేట్, మినరల్ ఆయిల్ వల్ల కేన్సర్ ప్రమాదం ఉంది. పిండిలో ఇనుము తుక్కు కలిపితే అనీమియా ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. కృత్రిమ రంగులు వల్ల చర్మ అలర్జీలు వస్తాయి. అసహజ రంగులు ఉన్న ఆహారాని తీసుకోవడం మానుకోవాలి.

- డాక్టర్ అన్నెపు శశిధర్, శశిధర్ ఆస్పత్రి ఎండీ


లావేరు మండలం కె.ఎస్.పురంలో నేలకొరిగిన అరటి

భారీ ఈదురు గాలులు

- కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- అంధకారంలో గ్రామాలు
- గంట పాటు కురిసిన వర్షం

ప్రజాశక్తి- లావేరు, ఎచ్చెర్ల, శ్రీకాకుళం

లావేరు, ఎచ్చెర్ల, శ్రీకాకుళం మండలాల్లో గురువారం సాయంత్రం 3 గంటల సమయంలో భారీ గాలులు, మెరుపులు, ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ గాలులకు భారీ చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. తీగలు తెగిపడడంతో అంతా అస్తవ్యస్తమైంది. లావేరు, లావేటిపాళెం, కేశవరాయునిపురం, జి.జి.వలస, గురుగుబిల్లి, తాళ్లవలస, సుభద్రాపురం గ్రామాల్లో భారీ చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు పడడంతో పలు గ్రామాలు అంధకారంలో ఉన్నాయి. అరటి 150 ఎకరాల్లోను, బొప్పాయి 120 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. రణస్థలం, రాజాం వెళ్లే రహదారిపై సీతంవలస, కేసవరయపురం గ్రామాల సమీపంలో పలుచోట్ల చెట్లు విరిగిపడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

కేశవరాయపురంలో ఎంపిపి పాఠశాల వద్ద చెట్టు విరిగి పడింది. దానికి సమీపంలో విద్యుత్ హైటెన్షన్ లైన్‌పై భారీ నిద్ర గన్నేరు చెట్టు విరిగిపోవడంతో ఇప్పటికి విద్యుత్ తీగలుపైనే చెట్లు వేలాడుతున్నాయి. మోటార్లు తిరగకపోవడంతో తాగునీటికి అవస్థలు పడుతున్నారు. మరోవైపు దోమలు గాఢాంధకరంతో ఎటూ వెళ్లలేని పరిస్థితి. నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

నేటి నుంచి డిఎస్‌సి పరీక్ష

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిలాల్లో డిఎస్‌సి పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతుంది. ఈ నెల 30 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా నుంచి 37,982 మంది పరీక్షలు రాయనున్నారు. 178 షిప్టుల్లో పరీక్షలు నిర్వహిస్తారు. నరసన్నపేట కోర్ టెక్నాలజీస్ కేంద్రానికి 12,478, ఎచ్చెర్లలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్‌కు 3,755, శివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌కు 7790, ఎస్ఎంఐటి ఆన్‌లైన్ కేంద్రానికి 1375, టెక్కలి ఐతమ్ కాలేజ్‌కు 4389, రాజాం జింఆర్ కాలేజ్ కేంద్రానికి 8195 మందికి కేటాయించారు. పక్కాగా పరీక్షలు నిర్వహణకు ఏర్పాట్లు చేసినుట్ల డిఇఒ తిరుమల చైతన్య చెప్పారు.



సెలవు రోజుల్లో మినహా పరక్షలు నిర్వహించనున్నారు. షెడ్యూల్ మేరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. హాల్‌టిక్కెట్లు అన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 వరకు, రెండో షిఫ్టు మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటలు నిర్వహించనున్నారు.

పాఠశాలలు, హాస్టళ్లలో సన్నబియ్యం

- రేషన్ డిపోల్లో రాగిపిండి, బెల్లం
- జిల్లా పౌరసరఫరాల డిఎం వేణుగోపాల్


బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న వేణుగోపాల్

ప్రజాశక్తి- లావేరు

ఈ నెల నుంచే జిల్లాలోని అన్ని పాఠశాలలకు, వసతిగృహాలకు విద్యార్థులు భోజనానికి మధ్యాహ్నం భోజన పథకంలో సన్నబియ్యం సరఫరా చేస్తామని జిల్లా పౌరసరఫరాల మేనేజర్ టి.వేణుగోపాల్ అన్నారు. లావేరు, రణస్థలం మండలాలకు సరఫరా అయ్యే పౌర సరఫరాల గోదాంను గురువారం తనిఖీ చేశారు. ఈ మేరకు గోదాంలో బియ్యం, పప్పు, పంచదార తదితర సరుకులు నిల్వలను పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం, వసతిగృహాల్లో విద్యార్థులకు సన్నబియ్యం సరఫరా చేస్తామని అన్నారు. ఇవి గుంటూరు జిల్లా తెనాలి నుంచి సన్నబియ్యం దిగుమతి చేసుకొని జిల్లాలోని సింగన్నపాళెంలో 25 కిలోలు చొప్పున బస్తాలు ప్యాకింగ్ చేస్తున్నామని తెలిపారు. దీనిపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని చెప్పారు. 830 టన్నుల సన్నబియ్యన్ని జిల్లాకు కేటాయించినట్లు తెలిపారు. రేసన్ డిపోలకు గోదాంల నుంచి వచ్చే బియ్యం బస్తాల్లో బాగా తరుగులు వస్తున్నాయని, అన్నీ డిపోల డీలర్లు ఆవేదన చెందుతున్నారని డిఎంను విలేకరులు ప్రశ్నించారు. దీనిపై తమకు ఫిర్యాదులు వస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామని బుదలిచ్చారు. పిడిఎస్‌కు జూన్ నెలకు బియ్యం పది వేల నాలుగు వందల మెట్రిక్ టన్నుల బియ్యం, 330 మెట్రిక్ టన్నుల పంచదారను జిల్లాలోని కార్డుదారులుకు సరఫరా చేస్తున్నామని తెలిపారు. రేషన్ డిపోలకు 80 మెట్రిక్ టన్నుల బెల్లం మరో 80 మెట్రిక్ టన్నుల రాగిపిండి జిల్లా వ్యాప్తంగా సరఫరాకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. అనంతరం గోదాం ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో లావేరు గోదాం ఇన్‌ఛార్జి సిహెచ్.ప్రవీణ్, సిబ్బంది అమర్, కరుణాకర్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు


మొక్కను నాటుతున్న కేంద్రమంత్రి, కలెక్టర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

భవిష్యత్ తరాలకు ప్లాస్టిక్ రహిత సమాజాన్ని అందించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యత అని కేంద్ర పౌర విమానయానశాఖ మాత్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం, వనమహోత్సవం సందర్భంగా గురువారం శ్రీకాకుళం నిర్వహించిన భారీ ర్యాలీని ప్రారంభించారు. పాత్రునివలస ఫ్లైఓవర్ నుంచి సాగిన ఈ ర్యాలీ అనంతరం, జిల్లాలో ఒక్కరోజులో 6 లక్షల మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనల మేరకు జిల్లాలో 6 లక్షల మొక్కలు నాటే బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. మొక్క మానవాళి మనుగడకు జీవాధారమన్నారు. మన భవితరాలకు ప్రాణవాయువు అందించాలంటే ప్రతిఒక్కరూ తమ నివాస పరిసరాల్లో మొక్కలు నాటాలన్నారు. అనంతరం అటవీశాఖ ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అతిథులచే గోనె చేతి సంచులు విడుదల చేయించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ మునగ, వేప, బాదాం, బొప్పాయి, ఉసిరిక వంటి ఐదు రకాల మొక్కలు పంపిణీ చేసినట్లు తెలిపారు. శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాదు వాటి సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఇఇ కరుణ, నగర కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు, మహిళా శిశుసంక్షేమ అధికారిణి శాంతిశ్రీ, జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.వెంకటేష్, శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి సాయిప్రత్యూష, పాత్రునివలస సర్పంచ్, తెలుగు యువత సమన్వయకర్త మెండ దాసు నాయుడు, స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు వెంకటస్వామి, కొమ్ము రమణమూర్తి పాల్గొన్నారు.

లీగల్ : జిల్లా కోర్టు ఆవరణలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా పలు రకాల మొక్కలను నాటారు. కార్యక్రమంలో నాల్గో అదనపు జిల్లా జడ్జి ఎస్.ఎం.ఫణికుమార్, చైర్మన్ జి.సువర్ణరాజు, ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి పి.శాంతిశ్రీ, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గేదెల వాసుదేవరావు, ఎజిపి జి.వినయ్ భూషణ్, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ రఘురాం, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, ఫైర్ ఆఫీసర్ పాల్గొన్నారు.

సిటీ : శ్రీకాకుళం ఆర్‌జెయుకెటి క్యాంప్ కార్యాలయంలో డాక్టర గేదెల రవి, డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ ఆధ్వర్యాన ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటి ప్రొఫెసర్ కె.వి.డి.జి. బాలాజీ మొక్కలను నాటారు. కార్యక్రమంలో అరుణ బాలాజీ సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యాన చేపట్టిన కార్యక్రమంలో కలెక్టర్ మొక్కలను నాటారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, మెంటార్ నటుకుల మోహన్, డిసి బాడాన దేవభూషణ్, ఉపాధ్యక్షులు డాక్టర్ పైడి సిందూర, టెక్కం రాంగోపాల్, కోశాధికారి బి.కృష్ణచైతన్య పాల్గొన్నారు.


మొక్కను నాటుతున్న కలెక్టర్, జిల్లా జడ్జి

పలాసలో మద్యంపై అల్లుడు ట్యాక్స్


మాజీ మంత్రి డాక్టర్ అప్పలరాజు



ప్రజాశక్తి- పలాస

పలాస నియోజకవర్గంలో మద్యంపై పెద్దఎత్తున అల్లుడు ట్యాక్స్ వసూళు చేస్తున్నారని, క్వార్టర్ బాటిల్‌పై రూ.10 అల్లుడు ట్యాక్స్ వేయడం వల్ల రోజుకు రూ.3 లక్షలు నెలకు రూ.కోటి మందుబాబుల నుంచి అక్రమంగా దందా వసూలు చేస్తున్నారని మాజీ మంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజు ఆరోపించారు. గురువారం ప్రగతిభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. పలాస నియోజకవర్గంలో 22 మద్యం దుకాణాలు, రెండు బార్లు ఉన్నాయని అన్నారు. వీటి ద్వారా రోజూ 30 వేల బాటిళ్లు విక్రయిస్తున్నారని తెలిపారు. పలాసలో జరుగుతున్న మద్యం దందాను తాము పవన్ కళ్యాణ్ చెప్పినట్లు అల్లుడు ట్యాక్స్ గానే భావిస్తున్నామన్నారు. ఒక స్వతంత్ర సరమయోధుడు కుటుంబానికి చెందిన వ్యక్తులు సారాపై అక్రమ వసూళ్లకు పాల్పడడం నీచంగా ఉందన్నారు. అదనపు వసూళ్లకు పోలీసులు వంత పాడడం ఏమిటని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ప్రమేయం లేకుండానే మద్యంపై అదనపు వసూళ్లకు అన్ని శాఖాధికారులు సహకరిస్తున్నారా? అని ప్రశ్నించారు.

జీడి పరిశ్రమలు తెరవాలి


మాట్లాడుతున్న నాయకులు

పలాస : జీడి పరిశ్రమలు ఆకస్మికంగా బంద్ చేయడం వల్ల కార్మికులకు ఉపాధి లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే పరిశ్రమలు తెరవాలని కాష్యూ లేబర్ అసోసియేషన్ శిస్టు గోపి, అంబటి ఆనంద్, సిఐటియు నాయకులు ఎన్.గణపతి, పి.లక్ష్మిలు డిమాండ్ చేశారు. పలాస లేబర్ కాలనీలో గురువారం విలేకరులతో మాట్లాడారు. అనుమతులు లేకుండా పరిశ్రమలు బంద్ చేయడం చట్ట విరుద్ధమన్నారు. పప్పుకు ధర లేదు కాబట్టి బందుకు పిలుపు ఇచ్చినట్లు పరిశ్రమల యాజమాన్యాలు చెప్పడం సరైనది కాదని అన్నారు. లాభాలు వచ్చినప్పుడు కార్మికులకు ఇన్సెంటివ్ ఏమీ ఇవ్వడం లేదని తెలిపారు. నష్టాలు పేరుతో పరిశ్రమలు మూసివేయడం వల్ల కార్మికులకు ఉపాధి లేకుండాపోయిందని అన్నారు. వెంటనే పరిశ్రమలు తెరిచి ఉపాది కల్పించాలని, లేని యెడల మూసివేసిన కాలానికి కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్మికులు వి.బాలకృష్ణ, ప్రసాద్, రాజు, ఎస్.ధనలక్ష్మి, ఎల్.రాజేశ్వరి, వాసుపల్లి కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కపోత... విద్యుత్ కోత

ప్రజాశక్తి- కవిటి

మండలంలో అనధికారికంగా జరుగుతున్న విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడుతున్నారు. ఓవైపు ఉక్కపోత.. మరోవైపు కరెంటు కోతతో చిన్నారులు, వద్ధులు, కిడ్నీ రోగులు అల్లాడుతున్నారు. సమయం, సందర్భం లేని విద్యుత్ కోతలు అటు చిరు వ్యాపారులకు, ఇటు సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలుగజేస్తున్నాయి. దీంతో పగలంతా పనిచేసే రాత్రి సేద తీరుతామని అనుకుంటున్న సామాన్యుడికి విద్యుత్ కోతలు మంటలు పుట్టిస్తున్నాయి. కరెంటు వాడినా, వాడకపోయినా విద్యుత్ ఛార్జీల మోత తప్పడం లేదని కానీ అదే స్ఫూర్తితో విద్యుత్ సరఫరా జరగడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిలగాం ఫీడర్‌లో ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండానే సుమారు 8 గంటల పాటు విద్యుత్ నిలిపివేయడంతో అన్ని వర్గాలు తీవ్రంగా ఇబ్బందులు పడ్డాయి. చివరికి తాగేందుకు తాగునీరు కూడా లేని పరిస్థితి ఏర్పడింది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రజా సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు స్పందించి విద్యుత్ కోతల నియంత్రించి పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా చేయాలని కోరుతున్నారు.

నిద్ర కూడా ఉండడం లేదు

అనధికార విద్యుత్ కోతలతో రోజూ సమస్యలు వస్తున్నాయి. పగలంతా కష్టపడి సాయంత్రం ఇంటికొస్తే విద్యుత్ లేకపోవడంతో సామాన్యులు సమస్యలు పడుతున్నారు. సమయం, సందర్భం లేకుండా విద్యుత్ కోతలు విధించడం, ఒకవేళ విద్యుత్ ఉన్నా లోఓల్టేజీ సమస్యలు ఉండడంతో కిడ్నీ రోగులు, చిన్న పిల్లలు, గర్భిణులు, వృద్ధులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. దోమలు వల్ల ఆరోగ్యంగా ఉన్నటువంటి వ్యక్తులు కూడా జబ్బులు బారిన పడుతున్నారు. మా సమస్యలు దృష్టిలో ఉంచుకుని కనీసం రాత్రి సమయంలోనైనా పూర్తిగా విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలి.

- మోహన్ దళాయి, వ్యవస్థాపకులు మాతృమూర్తి యువజన సేవా సంఘం, కుసుంపురం

మా ప్రయత్నం చేస్తున్నాం

గ్రామీణ ప్రాంతాల్లో గాలుల వల్ల కమ్ములు, చెట్ల కొమ్మలు విరిగి బ్రేక్ డౌన్ అవుతుంది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. మా సిబ్బంది ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తున్నారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందేలా మా ప్రయత్నం చేస్తున్నాం.

- యు.శ్రీనివాసరావు, ఎఇ, కవిటి

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

ప్రజాశక్తి- బూర్జ, ఎచ్చెర్ల, నందిగాం

బూర్జ, ఎచ్చెర్ల, నందిగాం మండలాల్లో సంభవించిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకుంది. ఈ ప్రమాదాలపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


బూర్జ : కేతన్ మృతదేహం

సరుబుజ్జిలి మండలం దెబ్బలుపేటకు చెందిన రాజేశ్వరి, కాళిదాసులు కూలి పని చేసుకుంటూ తమకు ఉన్న ఇద్దరు ఆడపిల్లలను అల్లరి ముద్దుగా పెంచుతుండేవారు. సాఫీగా సాగుతున్న వారి జీవితంలో రాజేశ్వరి భర్త కాళిదాసు అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో కుటుంబం పస్తులు ఉండాల్సిన పరిస్థితి తలెత్తింది. రాజేశ్వరి కష్టాలకు కృంగకుండా కుటుంబ బాధ్యతలను తలపై మోసింది. శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో ప్రయివేట్ సెక్యూరిటీ గార్డుగా చేరింది. అయితే విధులకు తమ గ్రామం దూరం కావడంతో అలాగే పిల్లలకు మంచి విద్యాబుద్ధులు చెప్పించేందుకు వీలుగా శ్రీకాకుళం పట్టణానికి సమీపంలో ఉన్న ఆముదాలవలస పట్టణంలోని నాయుడుపేట కాలనీలో అద్దెకు నివాసం ఉంటుంది.

రాజేశ్వరి పెద్ద కుమార్తె కేతన్ ఆముదాలవలస పట్టణంలో భవిత ప్రయివేట్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతుంది. అయితే కేతన్‌కు ముక్కులో ఇన్ఫెక్షన్ వండడం వల్ల రాజాం తండ్రి కాళిదాస్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుంది. అక్కులపేట మీదుగా గుత్తావల్లి నుంచి వెళ్తుండగా... గుత్తావల్లి సమీపంలో ఇటుకుల ట్రాక్టర్‌ను తప్పించే ప్రయత్నంలో బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. అనంతరం ట్రాక్టర్ ఢీకొనడంతో కేతన్ అక్కడికక్కడే మృతి చెందింది. తండ్రి కాళిదాస్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో జెమ్స్‌కు తరలించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ప్రవళ్లిక ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. కుమార్తె చనిపోవడం, భర్త ప్రాణాపాయ స్థితిలో భర్త కొట్టుమిట్టాడుతుండడంతో రాజేశ్వరి గుండెలలిసేలా విలపిస్తుంది.దీంతో నాయుడుపేట కాలనీలో విషాద ఛాయలు అలముకున్నాయి.

ఎచ్చెర్ల మండలం పరిధిలో తమ్మినాయుడుపేట జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఒడిశా వాసి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు ఒడిశాకు చెందిన భజరంగ భగత్యా (32) విశాఖపట్నంలోని డాక్ యార్డ్‌లో పనిచేస్తున్నాడు. ఆయన మంగళవారం ఒడిశాలో ద్విచక్ర వాహనంపై బయలుదేరి విశాఖపట్నం వెళ్తుండగా తమ్మినాయుడుపేట వద్ద గేదెను ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను 108 వాహనంలో శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుని బావమరిది ప్రమోద భగత్యా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వి.సందీప్ కుమార్ తెలిపారు.

నందిగాం మండలంలోని పెద్దబానాపురం వద్ద జాతీయ రహదారిపై గురువారం మధ్యాహ్నం సంభవించిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. హైదరాబాద్ నుంచి భువనేశ్వర్ వెళ్తున్న మినీ వ్యాన్ అదే రహదారిపై టెక్కలి వైపు నుంచి పలాస వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో వ్యానర్ డ్రైవర్ గాయపడి ఇరుక్కున్నాడు. పోలీసులు, 108 సిబ్బంది, స్థానికులు కలిసి బయటకు తీసి టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. మృతుని వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

త్వరితగతిన బొంతు ఎత్తిపోతల పనులు

సారవకోట: మండలంలోని రైతులకు సాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన బొంతు ఎత్తిపోతల పథకాన్ని త్వరలోనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. ఈ మేరకు గురువారం ఎత్తిపోతల పథకాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. తమ ప్రభుత్వ హయాంలో రూ.180.22 కోట్లు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించామని వివరించారు. దీనివల్ల 69 గ్రామాలకు 11,700 ఎకరాలకు సాగునీరు అందుబాటులోకి వస్తుందని, త్వరలో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, ఎంపిపి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

లావేరు: రహదారి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే ఎన్ఇఆర్ ఆదేశించారు. గురువారం మండలంలోని వెంకటాపురం నుంచి పెదలింగాలవలస గ్రామానికి వెళ్లే రహదారికి ప్రభుత్వం ఇటీవల రూ.1.75 కోట్లు మంజూరు చేయగా జరుగుతున్న నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రహదారి పనులు వేగవంతం చేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, రహదారికి ఇరువైపుల బెర్ములు నిర్మించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, అప్పలనాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కౌలు హక్కు పత్రాల అందజేత

కోటబొమ్మాళి: కౌలుకు వ్యవసాయం చేసే రైతులు సంబంధిత భూయజమాని సమ్మతితో గ్రామ రెవెన్యూ అధికారి నుంచి తప్పని సరిగా కౌలు హక్కు పత్రం తీసుకోవాలని ఎ.ఒ. ఎస్.గోవిందరావు అన్నారు. మండలంలోని చిట్టివలస రైతు భరోసా కేంద్రం పరిధిలో గల కౌలు రైతుల గుర్తింపు సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలుకు వ్యవసాయం చేసే రైతులకు కౌలు హక్కు పత్రం ఉండటే వారికి రాయితీపై విత్తనాలు, ఎరువులు, పంట రుణాలు, అన్నదాత సుఖీభవ, పంట నష్టం వంటి ప్రభుత్వ పథకాలను అందుతాయన్నారు. అనంతరం భూసార పరీక్ష పత్రాలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో వివిఎ టి.శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

సారవకోట: నిరుపేదలకు వైద్య సహాయం అందజేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. సారవకోట మండలం బొంతు ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. వైద్యులతో మాట్లాడుతూ ఒపి ఏ మేరకు వస్తుందో అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి ప్రసవాలకు ఎక్కువగా కృషి చేయాలని సూచించారు. వైద్య సేవలు మరింత మెరుగుపడే విధంగా చూడాలని డాక్టర్ని ఆదేశించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, తహశీల్దార్, ఎంపిడిఒ, ఎంపిపి, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ ఇంకుడు గుంతలు

ఇచ్ఛాపురం: ప్రతి ఇంటి వద్దా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సెర్ప్ ఎపిఎం ప్రసాదరావు అన్నారు. మండలంలోని తేలుకుంచిలో మహిళా సంఘాలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వర్ణాంధ్రలో భాగంగా ప్రతి ఇంటి వద్దా హోమ్ కంపోస్టు, కిచెన్ గార్డెన్, ఇంకుడు గుంతలు ఏర్పాటుకు అవగాహన కల్పించారు. అనంతరం ఆవరణలో మొక్కలను నాటారు. ఈ నెల 21న నిర్వహించనున్న యోగా దినోత్సవం అనుసరించి ప్రతి సభ్యులూ యోగా యాప్‌లో పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రుణాలను సూక్ష్మరుణ ప్రణాళిక ద్వారా వెంటనే తయారు చేసి మహిళల వ్యాపారవేత్తలుగా తయారవడానికి అవసరమైన సూచనలు, సలహాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో దాట్ల పార్వతి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య విద్యార్థికి ప్రతిభ అవార్డు

ఇచ్ఛాపురం: ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిభ అవార్డులను ప్రకటించింది. స్థానిక ఆదిత్య జ్యూనియర్ కాలేజీకు చెందిన షేక్ రుక్సార్ బైపిసిలో ప్రతిభ అవార్డును కైవసం చేసుకుంది. ఈమెకు ఇంటర్‌లో 922 మార్కులు సాధించింది. ఈమె తండ్రి షేక్ మహమ్మద్ ట్యాక్సీ డ్రైవర్, తల్లి రెహన బేగం గృహిణి. ఇచ్ఛాపురం ప్రయివేట్ కళాశాలల చరిత్రలో మొట్టమొదటి సారిగా ఈ ప్రతిభ అవార్డును షేక్ రుక్సార్ సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

ఐటిఐ కౌన్సెలింగ్ ప్రారంభం

శ్రీకాకుళం సిటీ: జిల్లాలో 23 ప్రభుత్వ, ప్రైవేట్ ఐటిఐల్లో ప్రవేశాలకు ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటిఐలో గురువారం కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఈ నెల 8 వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. మొదటి రోజు 277 మంది హాజరు కావాల్సి ఉండగా, 109 మంది హాజరయ్యారు. 109 మందికి సీట్లు కేటాయించారు. సీట్లు 3512 ఉండగా, దరఖాస్తులు 1035 వచ్చాయి. కౌన్సెలింగ్ ప్రక్రియను జిల్లా ఉపాధి అధికారి సుధ, కన్వీనర్ ఎల్.సుధాకరరావు, అడ్మిషన్ కమిటీ సభ్యులు చిట్టి నాగభూషణం, జెసి ప్రతినిధి విద్యాసాగర్, ప్లేస్‌మెంట్ అధికారి కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్స్ సర్వీస్ సొసైటీ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

కవిటి: ఫొటో గ్రాఫర్స్ సర్వీస్ సొసైటీ నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం నిర్వహించారు. అధ్యక్షునిగా ఆరింగి గోపి, ఉపాధ్యక్షునిగా బల్ల అశోక్, కార్యదర్శిగా వెంకటేష్, ఉప కార్యదర్శిగా రాము, కోశాధికారిగా ఆనంద్ గజపతి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుని గోపి మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్ల సాంకేతిక అభివృద్ధితో పాటు నిర్వంతరం వర్క్‌షాపులు, ఫొటోగ్రఫీ వీడియో ఎడిటింగ్, ఆల్బమ్ డిజైనింగ్ వంటి అంశాలపై నిరంతరం శిక్షణతో పాటు ఫొటోగ్రాఫర్ వ్యక్తిగత అభివృద్ధికి తమ సొసైటీ పాటు పడుతుందని తెలిపారు.

మొక్కలతోనే మానవ మనుగడ



శ్రీకాకుళం : మొక్కలు నాటుతున్న హరికిశ ప్రసాద్ తదితరులు

ప్రజాశక్తి – లావేరు

వచ్చిన చెట్టు ప్రగతికి సోపానమని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని నడుం బిగించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం లావేరు జెడ్‌పి పాఠశాల మైదానంలో మొక్కలు నాటారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఎస్ఎంసి చైర్మన్ లంకలపల్లి గణపతిరావు, ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, ఎంపిడిఒ పి.వెంకటరాజు, ఎంఇఒ మజ్జి మురళీకృష్ణ, ఎపిఒ రెడ్డి సత్యవతి, లంకలపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్థానిక శాఖ గ్రంథాలయ ఆవరణలో ఎమ్మెల్యే ఈశ్వరరావు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.

రణస్థలం రూరల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని నాయకులు, అధికారులతో కలిసి తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే ఎన్. ఈశ్వర రావు మొక్కలు నాటారు. తహశీల్దార్ నందిగాం ప్రసాదరావు, కూటమి నాయకులు లంక శ్యాం, డిజిఎం ఆనందరావు, గొర్లె లక్ష్మణరావు, పిన్నింటి వెంకట భానోజీ నాయుడు, జగన్నాథం నాయుడు, శ్రీనివాసరావు, ప్రభ, మహేష్, చిరంజీవి, లక్ష్మణరావు, బాబూరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం: హర్షవల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని అరసవల్లి జంక్షన్‌లో గల చైతన్య కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో హరికిశ ప్రసాద్, డిస్ట్రిక్ట్ విద్యా సంక్షేమ కమిటీ చైర్మన్ డాక్టర్ జామి భీమశంకర్, మాజీ ఆంధ్రవిశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యుడు వావిలపల్లి జగన్నాథ నాయుడు, హర్షవల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, డాక్టర్ మెడిసెట్టి సత్య స్వరూప్, కరణం శోభారాణి, జోన్ చైర్మన్ మణిశర్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత, జాతీయ సేవా పథకం అధికారి జలుమూరు రవిబాబు, కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ బి.చంద్రమౌళి, బి.మోహనరావు స్వామి, నారాయణరావు, నర్సింగరావు, సురేష్, పుష్ప, సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారి వెంకయ్య పేటలో చెరువుగట్టు నందు మొక్కలు నాటారు. కార్యక్రమంలో కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్, మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత, టిడిపి నాయకులు రమేష్, బోర గోవిందరావు, రెడ్డి రాంబాబు పాల్గొన్నారు.

రణస్థలం: పర్యావరణ రక్షణకు అందరూ ఉద్యమంలా మొక్కలు నాటాలని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. మండలంలోని పాతర్లపల్లిలో యానాడ రమణ పొలంలో వివిధ రకాల ఉద్యాన మొక్కలను నాటారు. కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ భూసార విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కుమార్ అభిషేక్, టెక్నికల్ అసోసియేట్, ఫార్మ్ మెకానైజేషన్ పార్థ రాజేంద్ర సింగ్ పవర్, ఏరియా మేనేజర్ పి.తవిటి నాయుడు, నరసింహమూర్తి, నారాయణరావు, అనిల్, శ్రావణి రైతులు పాల్గొన్నారు.

అలాగే దేరసాంలో ఉపాధిహామీ కూలీలతో, గ్రామ ప్రజలతో కలిసి పలుచోట్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపిటిసి దన్నాన వంశీకృష్ణ, ఉపాధి కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పొందూరు: మండల కేంద్రంలోని తహశీల్దార్, ఎంపిడిఒ, ప్రభుత్వ కార్యాలయాల్లోను, రాపాక, కేశవదాసుపురం, పిల్లలవలస తదితర గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్.వెంకటేష్ రామానుజులు, ఎంపిడిఒ మీసాల మన్మథరావు, టిడిపి మండల అధ్యక్షుడు చిగులపల్లి రామ్మోహనరావు, అన్నెపు రాము, చింతాడ కృష్ణ వాసుదేవరావు, బలగ శంకరభాస్కర్, ఎ.చినరంగ తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్‌జియుకెటి క్యాంపస్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కెవిడిజి బాలాజీ, డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ గేదెల రవి, డా. అరుణ బాలాజీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ముని రామకృష్ణ, శివరామకృష్ణ, కె. మోహనరావు విద్యార్థులు పాల్గొన్నారు.

పాతపట్నం : మండలంలోని పెద్దసీదిలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మొక్కలను నాటారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మంచు కరుణాకరరావు, ఫారెస్టు రేంజర్ పి.అమ్మన్నాయుడు, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, తహశీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్ఐ బాబీ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక సంతపేట పంపుహౌస్ వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి మొక్కలను నాటారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి, టిడిపి నాయకులు నందిని జాని, రంగాల శ్రీనివాసరావు, ప్రసాదరావు ఆచారి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర పాల్గొన్నారు.

కవిటి: ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఎంపిడిఒ విశ్వేశ్వం రావు, బెలగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో, దూగానపుట్టుగలో సర్పంచ్ భద్రాచలం, కార్య దర్శి హరీష్, కృష్ణారావు, దివాకర్, సిసింద్రి కవిటి ఆర్ష విజ్ఞాన భారతి పాఠశాలలో ప్రిన్సిపాల్ ఎం.అనిల్ మొక్కలను నాటారు.

పోలాకి : ఎంపిడిఒ, ఆర్‌డబ్ల్యుఎస్, వెలుగు కార్యాలయాల్లో మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్ మజ్జి రమణమ్మ, ఎంపిడిఒ కె.రవికుమార్, టిడిపి మండల అధ్యక్షులు మిరియాపిల్లి వెంకట అప్పలనాయుడు, నరసన్న పేట ఎఎంసి మాజీ చైర్మన్ భాస్కరరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, తహశీల్దార్ అప్పలరాజు పాల్గొన్నారు. స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో ఎంపిడిఒ కుప్పిలి ఫణీంద్రకుమార్, కొత్తమ్మతల్లి ఆయల ప్రాంగణంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ, టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్, జూనియర్ సివిల్ కోర్టులో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎల్. శ్రీనివాసులు, కోర్టు సిబ్బంది మొక్కలను నాటారు.

కొత్తూరు : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ నీరజ, ఇఒపిఆర్‌డి కె.వసంతకుమారి, ఎఒ బి.రాంబాబు, మోహనరావు, సర్పంచ్ కృష్ణవేణి, కంచక చెరువు గట్టు వద్ద వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు తదితరులు మొక్కలు నాటారు.

మెళియాపుట్టి : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పలాస వ్యవసాయ శాఖ ఎడి మండల స్పెషల్ ఆఫీసర్ లింగాల మధుబాబు, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా అన్నారు. మెళియాపుట్టి, చాపర గ్రామాల్లో పలు ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిటి రాము, సీనియర్ అసిస్టెంట్ జగన్మోహనరావు, ఎంఇఒలు ఎస్.దేవేందరరావు, ఎం.పద్మనాభరావు, మండల సర్వేయరు శ్యామలరావు, హౌసింగ్ ఎఇ గణేష్, కార్యదర్శి చింతల అప్పారావు, మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



లావేరు : మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు తదితరులు

నౌపడ : సంతబొమ్మాళి ఎస్‌డబ్ల్యుఎస్‌పిసి సెంటర్ వద్ద జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య, జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం కో–ఆర్డినేటర్ నిచ్చల, ఎంపిడిఒ ఐ.పద్మజ, సర్పంచ్ కళింగపట్నం లక్ష్మి, బోరుభద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డాక్టర్ పి ఆవని, సంతబొమ్మాళి దండుగోపాలపురం ఆరోగ్యం వద్ద డాక్టర్ కె..శివరంజని, నౌపడ ఆరోగ్య కేంద్రం వద్ద డాక్టర్ పరిమళ, డాక్టర్ నందిని మొక్కలు నాటారు.

నరసన్నపేట: మండలంలోని దేవాదిలో ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయశాఖ డాక్టర్ వి.హరికుమార్ మొక్కలు నాటారు. ఎఒ సునీత, సర్పంచ్ రాము పాల్గొన్నారు.

టెక్కలి : కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పినకాన అజయ్‌కుమార్ మొక్కలను నాటారు. న్యాయవాదులు మెట్ట గోవింద్, ఎల్. బాలకృష్ణ, పొట్నూరు ఆనంద రావు, ఎ.వైకుంఠరావు, ఎస్.దివాకర్ పాల్గొన్నారు.

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జనవిజ్ఞాన వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యాన మొక్కలు నాటారు. జెవివి జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు, సబ్‌కమిటీ కన్వీనర్ ధర్మారావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రోణంకి రామచంద్రరావు, దూసి ఆంధ్రాస్టాలిన్, డాక్టర్ లక్మణరావు, సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖరావు, కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ లూక్‌పాల్, జి.కసవయ్య పాల్గొన్నారు. అలాగే తహశీల్దార్ కార్యాలయంలో టిడిపి జిల్లా అధ్యక్షులు బగాది శేషగిరి మొక్కలను నాటారు. తహశీల్దార్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


పలాస స్థానిక జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే గౌతు శిరీష, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ ఎన్.వసంతకుమార్, ఎంఆర్‌సి వద్ద ఎంఇఒ శ్రీనివాసరావు, కోర్టు ఆవరణలో జడ్జి జడ్జి యు.మాధురి మొక్కలు నాటారు.

సోంపేట : కోర్టు ఆవరణలో జడ్జి కె.కిషోర్‌బాబు మొక్కలను నాటారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు, సిఐ పాల్గొన్నారు.

నందిగాం: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపిడిఒ కుమార్ పట్నాయక్, కోటిపల్లి ఎలిమెంటరీ పాఠశాల వద్ద జనసేన నాయకులు టి.చిరంజీవి మొక్కలను నాటారు.

వజ్రపుకొత్తూరు : రైతు ఉత్పత్తిదారుల సంస్థ కార్యాలయం ఆవరణలో ఎపిఎం జి.ప్రసాదరావు మొక్కలను నాటారు.

ప్రిన్సిపాల్‌గా సుష్మ



సుష్మ ప్రిన్సిపాల్

బూర్జ: ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా గుడిమెట్ల సుష్మ గురువారం బాధ్యతలను చేపట్టారు. గతంలో ఎస్‌కోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పని చేశారు. ప్రస్తుతం పదోన్నతపై బూర్జ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టినట్లు ఆమె తెలిపారు.

ప్రశాంతంగా లాసెట్

శ్రీకాకుళం సిటీ: ఎపి లాసెట్ పరీక్ష ఆన్‌లైన్ పద్ధతిలో గురువారం నిర్వహించారు. చిలకపాలెం శివానీ కళాశాలలో 279 మందికి 193 మంది హాజరయ్యారు. ఎచ్చెర్ల వెంకటేశ్వర కళాశాలలో 179 మందికి 136 మంది, టెక్కలి ఐతమ్ కళాశాలలో 231 మందికి 164 మంది హాజరయ్యారు. సజావుగా పరీక్షలు నిర్వహించారు.

ప్రశాంతంగా ఎడ్‌సెట్ పరీక్ష

శ్రీకాకుళం సిటీ: ఎపి ఎడ్‌సెట్ పరీక్ష అన్‌లైన్ పద్ధతిలో గురువారం నిర్వహించారు. చిలపాలెం శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో 281 మందికి 253 మంది పరీక్ష రాశారు. ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో 180 మందికి 154 మంది పరీక్ష రాశారు. టెక్కలి ఐతమ్ కళాశాలలో 230 మందికి 198 మంది పరీక్ష రాశారు. ప్రశాంతంగా పరీక్షలు పూర్తయ్యాయి.

డిసిసిబి చైర్మన్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సూర్యనారాయణ

శ్రీకాకుళం సిటీ: స్థానిక దండి వీధిలో గల జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో గురువారం డిసిసిబి చైర్మన్‌గా పదవి బాధ్యతలను శివ్వాల సూర్యనారాయణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, డిసిసిబి ముఖ్య కార్యనిర్వహణాధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా మధుసూదనరావు



మధుసూదనరావు

పొందూరు: పొందూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డా.సిహెచ్ మధు సూదనరావు గురువారం బాధ్యతలను చేపట్టారు. ఆంధ్రయూనివర్శిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ హిస్టరీ అండ్ ఆర్కియాలజీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న మధు సూదనరావును ఉన్నతాధి కారులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించారు. ఈ సందర్భంగా కళాశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

సోంపేట: మండలంలోని ఉప్పల పంచాయతీ ఎకువూరులోని పాఠశాల వద్ద శనివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మెరైన్ సిఐ రమేష్ కుమార్ తెలిపారు. బారువ మెరైన్ పోలీసుల ఆధ్వర్యాన జరిగే ఈ వైద్య శిబిరానికి శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రి వైద్యులు హాజరై వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

ఆర్ట్స్ సంస్థతోనే ఆదివాసీల అభివృద్ధి

ఎమ్మెల్యే కూన రవికుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి– బూర్జ

ఆర్ట్ స్వచ్ఛంద సంస్థతోనే ఆదివాసీలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందడం జరిగిందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. గురువారం మండలంలోని పెద్దపేట గ్రామంలో నున్న ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ట్స్ సంస్థ ప్రారంభించి 33 ఏళ్లు పూర్తిచేసుకుందన్నారు. సంస్థ ప్రారంభం నుంచి ఆదివాసీలతో పాటు వెనుకబడిన అన్ని గ్రామాల్లోను ప్రజలను చైతన్యవంతులను చేయడమే కాకుండా వారి ఆర్థిక అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. గిరిజనులను చైతన్యవంతం చేసి వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఎన్నో కార్యక్రమాలను అమలు చేశారన్నారు. ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావుకు ఎన్నో ఉద్యోగ అవకాశాలు వచ్చినప్పటికీ నిరుపేద కుటుంబాలను ఆదుకునే ఉద్దేశంతో ఏర్పాటు చేసి ఎందరో జీవితాలకు వెలుగులు నింపారన్నారు. ఆదివాసి రైతులకు పైనాపిల్ మార్కెటింగ్‌లో రైతు ఉత్పత్తిదారుల కంపెనీలు ఏర్పాట్లు ఎంతో కీలకంగా పని చేశారని, కోవిడ్ సమయంలో అనేక సేవలు అందించారన్నారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా గోగునారతో తయారుచేసిన ఉత్పత్తులను ప్రారంభించారు.

రక్తదాన శిబిరం ప్రారంభం

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు సహకారంతో 102 మంది వాలంటీర్లు నుంచి రక్తసేకరణ చేశారు. అంతకుముందు గోపి దేవి పేటలో ఎమ్మెల్యే మొక్కలను నాటారు. కార్యక్రమంలో నా బార్డ్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ టి.నాగార్జున, డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యం, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ డైరెక్టర్ రామకృష్ణ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాదరావు, కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు కె.భాగ్యలక్ష్మి, పి.ఉదయ బాబు, వ్యవసాయ శాస్త్రవేత్త డి.సత్యనారాయణ, డిసిసిబి సిఇఒ టి.రాజశేఖర్, ఖండాపు గోవిందరావు, మండల వ్యవసాయ అధికారి ఎం.శ్రీనివాసరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



పొందూరు : వరివిత్తనాలను రైతులకు పంపిణీ చేస్తున్న నాయకులు

వరి విత్తనాలు పంపిణీ

హిరమండలం : ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కావడంతో వ్యవసాయాధికారులు ఎల్లవేళలా రైతులకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. హిరమండలం సచివాలయం–1 వద్ద గురువారం 128 విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సకాలంలో విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని విన్నవించారు. స్థానిక రైతులు సమస్యలపై అధికారులు ఎమ్మెల్యేకు విన్నవించగా, తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే తక్కువ సమయంలో సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల అధికారులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నందిగాం : నందిగాం రైతు సేవా కేంద్రం–1 టిడిపి మండల అధ్యక్షులు పి.అజయ్‌కుమార్ రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేవారు. కార్యక్రమంలో ఎఇఒ ప్రగడ వాసవి, విఎలు అరవింద్, హారతి. చంద్రశేఖర్, కె.జయరాం, పి.బాలకృష్ణ, టి.చిరంజీవి, ఎం.బావనకుమార్, కె.సతీష్, ఎం.ప్రసాదరావు, ప్రదీప్‌కుమార్ పాణీగ్రహీ పాల్గొన్నారు.

పొందూరు: మండలం రాపాకలో రైతు సేవా కేంద్రంలో రైతులకు గురువారం వరి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. మొదటి విడతలో 265 బస్తాల సాంబా మసూరి, సోనా మసూరి, 1121 రకాల వరి విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి కొంచాడ గిరిబాబు, జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కరరావు, మండల తెలుగుయువత అధ్యక్షులు కండాపు శ్రీనివాసరావు, జనసేన పార్టీ జిల్లా జాయింట్ సెక్రటరీ కొంచాడ చిన్నంనాయుడు, సెక్రటరీ పి.శ్రీనివాసరావు, కూటమి నాయకులు నరేష్, గొల్లయ్య, అప్పలనాయుడు, విఎఎ దివ్య, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో వ్యక్తి అరెస్టు

ఇచ్ఛాపురం : ఒడిశా నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పట్టణ పోలీసులు అరెస్టు చేసి ఆయన వద్ద నుంచి 4.180 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సిఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం విలేకరులతో మాట్లాడారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన ఎలియా అనే వ్యక్తి రైల్వేస్టేషన్ వద్ద గంజాయితో అనుమానాస్పదంగా ఉన్నారని అన్నారు. ఆయన బ్యాగ్‌న పరిశీలించగా గంజాయి పట్టుబడిందన్నారు.

బలదలో చోరీ

కొత్తూరు : మండలంలోని బలదలో కంచారాపు పురుషోత్తం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. గురువారం ఇంటికి చేరుకుని చేశారు. తాళం వేసి ఉన్న దాన్ని పగలగొట్టి ఉంది. వెంటనే ఇంట్లోకి వెళ్లి చూడగా... తాళం పగలగొట్టింది. బీరువాలో ఉన్న రెండు తులాల బంగారు వస్తువులను చోరీ గురైనట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిఐ చింతడ ప్రసాదరావు, క్లూస్ టీమ్ వెళ్లి పరిశీలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ రాజేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్వాడీ కార్యకర్తలకు అండ

పలాస: అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు, గర్భిణులకు పౌష్టికాహారం పెట్టేందుకు అంగన్వాడీ కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారని, కూటమి ప్రభుత్వం వారికి అండగా ఉండాలనే ఉద్దేశంతో ఇండక్షన్ స్టవ్ పంపిణీ చేసిందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యాన అంగన్వాడీ కార్యకర్తలకు ఇండక్షన్ స్టవ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలుష్యా నివారణ చేసేందుకు గ్యాస్ స్టవ్ స్ స్థానంలో ఇండక్షన్ స్టవ్స్ ఉపయోగించాలన్నారు. అంగన్వాడీ కేంద్రానికి కావాల్సిన అనేక మౌలిక సదుపాయాలు సమకూరు స్తామన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'సంసిద్ధత' వాయిదా

టెక్కలి : రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ఆదేశాల మేరకు గురువారం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభం కావల్సిన ఉపాధ్యాయుల సంసిద్ధత కార్యక్రమం వాయిదా పడింది. ఈ నెల 12 నుంచి పాఠశాలలు తెరుచుకోవాల్సి ఉంది. ఈ ఏడాది నుంచి కొత్తగా ఉపాధ్యాయుల సంసిద్ధత కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు గురువారం నుంచి శనివారం వరకు మరుసగా మూడు రోజుల పాటు పాఠశాలలకు వెళ్లాలి. రానున్న విద్యా సంవత్సరంలో చేపట్టబోయే ప్రణాళికలు, విద్యార్థులకు నూతన ప్రవేశాలు, కిట్లు అందజేత వంటి కార్యక్రమాలపై ప్రణాళిక రూపొందించుకోవాలి. పాఠశాలలు తెరిచినాటికే విద్యాసంవత్సరం ఆరంభం నుంచే విద్యార్థులు చేరుకునేవిధంగా ఈ సంసిద్ధత కార్యక్రమాన్ని రూపొందించింది. ఇందుకు సంబంధించి ఉపాధ్యాయులు గురువారం నుంచి పాఠశాలలకు చేరుకునేందుకు మానసికంగా సిద్ధపడ్డారు. ఇంతలో విద్యాశాఖ కమిషనర్ వాయిదా వేసినట్లు ప్రకటించారు. ఈ నెల 9 నుంచి 11 వరకు ఈ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

పొందూరు: పొందూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేయబడునని విద్యుత్‌శాఖ ఇఇ పైడి యోగీశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పొందూరు సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ కారణంగా పొందూరు పట్టణం, దేవర వలస, ఇండస్ట్రియల్, కృష్ణాపురం, సిరిపురం ఫీడర్ల పరిధిలో గల గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిలిచి పోతుందన్నారు.

పాతపట్నం: మండలంలోని శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు శివాని నగర్, పెట్రోల్ బంక్, రౌతులక్ష్మీపురం ఫీడర్ పరిధిలోని గోపాలపురం, చంగుడి, సరాలి, తిడ్డిమి, రంకిని, సూర్యనారాయణపురం, దాసుపురం, కొరసవాడ ఫీడర్ పరిధిలోని బోరుభద్ర, బూరగ, బగదల గ్రామాలకు సరఫరా నిలుపుదల చేస్తున్నామని విద్యుత్‌శాఖ ఇఇ జి.శంకరరావు ప్రకటనలో తెలిపారు.

జిఎంఆర్ ఆర్థికసాయం


మెళియాపుట్టి: మండలంలోని జలకలింగుపురం, రట్టిని గ్రామాల్లో గురువారం ఆలయాలను ప్రతిష్టించారు. ఆయా గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొన్నారు. జె.ఎల్.పురం పాలపోలమ్మ ఆలయానికి రూ.50 లక్షలు, రట్టిని నీలమణి దుర్గ ఆలయానికి రూ.20 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించారు. అలాగే టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ, రాష్ట్ర తూర్పు కార్పొరేషన్ మాజీ చైర్మన్ సందర్శించారు. కార్యక్రమంలో గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్‌గౌడ, మాజీ ఎంపిపి సలాన మోహనరావు, టిడిపి మండల మాజీ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి, గణేష్ ప్రధాన్, రవ్వల గణపతిరావు, రవ్వల దుర్యోధన, రవికుమార్, రామారావు పాల్గొన్నారు.

కొత్తూరు: మండలంలోని మెట్టూరుకు చెందిన షావుకారి జోగారావు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ప్రస్తుతం విశాఖలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర సొండి కుల సంఘం అధ్యక్షుడు రత్నాల కాశీవిశ్వనాథం విశాఖ కెజిహెచ్‌కి వెళ్లి జోగారావుని పరామర్శించారు. అనంతరం రూ.30 వేలు ఆర్థికసాయం అందజేశారు. త్వరగా అనారోగ్య సమస్యల నుంచి కోలుకోవాలని కోరారు. కార్యక్రమంలో సొండి మహిళా అధ్యక్షులు నల్లన విజయలక్ష్మి, రాష్ట్ర కోశాధికారి రత్నాల శ్రీనివాసరావు, రాష్ట్ర సొండిల సంక్షేమ సంఘానికి సభ్యులకు ధన్యవాదములు తెలియజేశారు.

సొంతింటి కల తీరేదెలా..?

- పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వరు.. గృహాలు రావు
- లబ్ధిదారులకు తప్పని అవస్థలు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులు

రెవెన్యూ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తమ సొంతింటి కల నెరవేరడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్హులైన వారికి అన్ని ఇస్తామని ప్రకటనలు గుప్పిస్తున్నారు తప్ప ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.



బిసి కాలనీ

ప్రజాశక్తి- బూర్జ

సొంతంగా గృహాలు నిర్మించుకుంటామని ముందుకు వచ్చినప్పటికీ రెవెన్యూ శాఖ అధికారులు పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేయకపోవడం వల్ల తమ సొంతింటి కల నెరవేరడం లేదని మండల కేంద్రంలోని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిసి కాలనీలో ఇళ్లు నిర్మించుకునేందుకు పొజిషన్ సర్టిఫికెట్లు అవసరం కావడంతో రెవెన్యూ అధికారులకు పొజిషన్ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నామని లబ్ధిదారులు వాపోతున్నారు. అనునిత్యం కాళ్లరిగేలా తిరుగుతున్నప్పటికీ తమకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని లబ్ధిదారులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. దీంతో తాము ఇళ్లను నిర్మించుకోవడం కలగా మారిందని, పొజిషన్ సర్టిఫికెట్ కోసం అవస్థలు తప్పడం లేదని వాపోతున్నారు. గతంలో బూర్జ మండల కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఎమ్మెల్యేకు తమకు ఇళ్లు నిర్మించేందుకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇప్పించాలని బిసికాలనీకి సంబంధించిన 30 మంది కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత తహశీల్దార్‌కు వారం రోజుల్లో వీరికి పొజిషన్ సర్టిఫికెట్లు అందజేసి ఇళ్లు నిర్మించేందుకు ప్రతి ఒక్క అధికారి సహకరించాలని ఆదేశించారని లబ్ధిదారులు తెలిపారు. అయితే అందులో తొమ్మిది మందికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వడానికి ఇబ్బందులు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందులో బైబిల్ ధమయంతి, ఏనుగుల శ్రీదేవి, గిరిజాల మనోహర్, అల్లాడ అరుణ్ కుమారి, ముద్దాడ లక్ష్మి, ముద్దల తులసి దేవి, ధర్మావతిలు ప్రతిరోజు కార్యాలయం చుట్టూ తిరిగినా రెవెన్యూ అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని లబ్ధిదారులు తెలిపారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు స్పందించి పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆది నుంచి అన్నీ అనుమానాలే!



ఇదే షాపు

ప్రజాశక్తి– పలాస

కాశీబుగ్గ కెటి రోడ్డు శ్రీనివాసలాడ్జి కూడలి వద్ద ఖరగూర్‌కు చెందిన ఓ వృద్ధిడికి చెందిన స్థలం మొదటి నుంచి వివాదస్పదంగా మారింది. చిలికిచిలికి గాలివానలాగ మారి ఓ వైసిపి నాయకుడి చేతికి ఆ అంశం వెళ్లింది. దీన్ని మూడో కంటికి తెలియకుండా టెక్కలి సబ్‌జిస్ట్రార్ కార్యాలయంలో మూడు రోజుల క్రితం ఎవరి కంట పడకుండా రిజిస్ట్రేషన్ కావడం కొసమెరుపు. ఈ వివాద స్థలంలో రెవెన్యూశాఖకు చెందిన ఇద్దరు ఉద్యోగులు తహశీల్దార్ సెలవులో ఉన్న సమయంలో నిరంభ్యంతర పత్రం ఇచ్చి భారీగా నోట్ల మూటలు అందుకున్నట్లు పలాస–కాశీబుగ్గ జంట పట్టణాల్లో హాట్‌టాఫిక్ అయ్యింది. ఈ పత్రం ఆధారంగా వైసిపి నాయకుడు టెక్కలిలో ఏకంగా రిజిస్ట్రేషన్ చేయడం విశేషం. లేని స్థలానికి ఉన్నట్లు ఇవ్వడం ఒక తప్పయితే దీన్ని ఏకంగా రిజిస్ట్రేషన్ చేయడం మరో తప్పు ఈ విధంగా తప్పుపై తప్పులు, చేస్తూ... ఇతర ప్రాంత ప్రజలకు పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటిలో స్థలాలు కొనుగోలు చేయలంటే భయపడి చావాల్సిన పరిస్థితి కల్పిస్తున్నారు.